

# పుస్తక పరిచయం




**Published By**
**Anvikshiki Publishers(P)Ltd**

**Writer**
**nakshathram@gmail.com**
**Phone: 703-861-8368**

అమెరికాలోని ప్రవాసాంధ్ర రచయితల్లో బహుముఖ ప్రజ్ఞాశాలి, కథా రచనలో తనదైన పంథా ఏర్పరచుకున్న రచయిత - వేణు నక్షత్రంగా అందరికీ తెలిసిన  నక్షత్రం వేణుగోపాల్‌గారు. ఆయన ప్రచురించిన రెండవ కథా సంపుటి ఈ 'అరుగు'. 'అరుగు' అంటే ఏమిటో ఈ తరంలో ఎంతమందికి తెలుసో లేదో కానీ, పల్లెటూళ్ళలో ప్రతి యింటికీ 'అరుగు' ఉండడమనేది దశాబ్దాల క్రిందట తప్పనిసరి. పిల్లలు ఆడుకోడానికి, పెద్దలు ఊసులాడుకోడానికి, ప్రయాణీకులు సేదదీరడానికి అనేక విధాల ఉపయోగపడతాయి ఈ 'అరుగులు'. వేణుగారి 'అరుగు' సంపుటిలోని కథలు కూడా బహుముఖాలుగా ఆలోచింపచేయడానికి ఉపయోగపడతాయి. వేణుగారి కథలు ఊసుపోక వ్రాసేవి కాదు. అది భారతదేశమైనా, అమెరికా ఐనా చుట్టూ ఉన్న జీవితాల్లోని సున్నితమైన సమస్యల్నీ, ఎవరూ చూడని లేదా తక్కువమంది మాత్రమే చూడగలిగిన కోణాలనూ కథా వస్తువులుగా చేసుకునే బాధ్యతాయుతమైన రచయిత వేణుగారు. కథ ముగింపులో కేవల సమస్యను సమస్యగానే ముగించకుండా, అలాగని పేరాలకొద్దీ ఉపన్యాసాలు చెప్పకుండా, సమస్యకు పరిష్కారాన్ని కూడా సూచనప్రాయంగా కొన్నిసార్లు, ఆ వైపు నడిపించే ఆలోచనల్ని ప్రేరేపిస్తూ మరికొన్నిసార్లు తనదైన ప్రతిభను ప్రదర్శిస్తారు వేణుగారు. మొట్టమొదటి కథ 'రేస్' లో పెద్దలు పిల్లవాళ్ళ మీద తమ కోర్కెల్ని రుద్దుతూ డిగ్రీల 'రేస్' ల్లోకి వదలడాన్ని చక్కటి పోలికతో చిత్రించారు రచయిత. పిల్లవాడ్ని అనవసరమైన రేస్ లోకి వదిలితే వచ్చే అనర్థాన్ని అర్థం చేసుకున్న తండ్రి ఆలోచలనలతో కథను ముగించడం బాగుంది. ఈ సంపుటి శీర్షిక 'అరుగు' నే శీర్షికగా చేసుకున్న  కథలో పల్లెటూరి ఇంటి అరుగును వదిలి పిల్లల దగ్గరకు పట్నం వెళ్ళి, అక్కడ ఇమడలేక మళ్ళీ అరుగుల ఇంటికి చేరుకున్న రత్నమ్మ గురించి చెబుతూ ముగింపులో మనసుల్ని చెమ్మగిల్ల చేస్తారు రచయిత. అమెరికన్ జీవితాన్ని డాలర్ల వేటలో పరుగు పందెం చేసుకున్న యువజంట గురించి 'ధీమా' కథలోనూ, గ్రీన్‌కార్డ్ కోసం కొంతమంది వెదుక్కునే అడ్డుత్రోవల గురించి 'నయా వంచన' లోనూ చిత్రించారు రచయిత వేణు. మొత్తం 11 కథలున్న ఈ సంపుటికి ముందు మాట వ్రాస్తూ కొలకలూరి ఇనాక్ గారు "శ్రీ నక్షత్రం వేణుగోపాల్‌కు కథానిర్వహణ ఆసక్తికరంగా చేయడం బాగా పట్టుబడింది. పాత్ర సృష్టి, సన్నివేశ కల్పన, అతిశయోక్తులు లేకుండా సుదరంగా సహజంగా రాయడం తెలిసి వచ్చింది" అన్నారు. ఈ కథలు చదివిన పాఠకులు ఈ భావాలతో తప్పక ఏకీభవిస్తారు. సామాజిక స్పృహనే ఊపిరిగా చేసుకున్న వేణు నక్షత్రంగారి కలం నుంచి మరిన్ని మంచి కథలు రావాలని ఆశిద్దాం. ★★★



# పుస్తక పరిచయం




ఈ కథా సంపుటి రచయిత ప్రతాప వెంకట సుబ్బారాయుడుగారు గత నలభై ఏళ్ళుగా వివిధ ప్రక్రియల్లో సాహితీసేద్యం చేస్తున్నారు. కథ మీద అభిప్రాయాలను తెలియజేస్తూ ఉత్తరాలు రాయడం దగ్గర్నుంచి, వివిధ శీర్షికల్లో పాల్గొనడం, కార్డ్ కథలు, చిన్న కథలు, ఇన్‌లాండ్ లెటర్ కథలు, కాలం దాటని కథలు, పెద్ద కథలు, సీరియల్స్.. ఇలా. ఇంతవరకూ 200 కథలు, 125 పిల్లల కథలు, 150 కవితలు, 75 అంతర్యామి వ్యాసాలు, 60 సామాజిక ప్రయోజన వ్యాసాలు, 500 జోక్స్ వ్రాసి అసంఖ్యాకమైన పురస్కారాలు అందుకున్నారు. 4లక్షల తాళపత్రాలపై శ్రీరామ వ్రాయడం. 5040 బియ్యపు గింజలపై శ్రీరామ వ్రాయడం, సెంటిమీటర్ సైజు పుస్తకంలో పెద్ద బాలశిక్ష వ్రాయడం లాంటి రికార్డులు కూడా నెలకొల్పారు. వీరి వ్రాసిన పాతిక కథల సంపుటి ఈ 'ఏజ్డ్ బ్యాచిలర్స్. ప్రతాప వెంకట సుబ్బారాయుడుగారి కథలు సులభంగా, సరళంగా, చివరంటా చదివిస్తాయి. చిన్నచిన్న సంఘటనలను కూడా కథా వస్తువుగా మలచగల ప్రతిభ ఈ రచయిత సొంతం. పెద్దపెద్ద భారీ సమాసాలు, ఉపన్యాసాలు ఉండవు. రచయిత ఎంపిక చేసుకున్న కథాంశాన్ని బట్టి అతి చిన్న మలుపుతో కూడా పాఠకుడ్ని ఆసక్తికరంగా చదివించగల కథలివన్నీ. సందర్భానుసారం శృతి మించని హాస్యం కూడా ఈ కథల్లో అక్కడక్కడా తొంగిచూస్తుంది.

తల్లి మరణానికి తండ్రే కారణమని, నాన్నను నిర్లక్ష్యం చేసే కొడుకు, ఐనా కానీ కొడుకును చూడందే ఉండలేని తండ్రీ - మొదటి కథ 'విషాదాయోగం' మనసుల్ని కదిలిస్తుంది. డ్రైనేజ్ క్లీనర్ కొడుకు చదుకోసం త్యాగం చేశాడా, ఆత్మత్యాగం చేశాడా అనే విషయాన్ని అతిసున్నితంగా చిత్రించిన కథ 'బతుకు మీద భరోసా'. ఈ పుస్తకానికి మకుటమైన 'ఏజ్డ్ బ్యాచిలర్స్' శీర్షికతో వ్రాసిన కథ వృద్ధాప్యంలో ఓల్డ్ ఏజ్ హోమ్స్‌లో చేర్పించే పిల్లలకు గుణపాఠంగా నలుగురు వృద్ధులు తీసుకున్న నిర్ణయం 'ఔను కదా.. ఇదీ ఒక పరిష్కారమే కదా' అనిపిస్తుంది. ప్రతి కథ ఓ ఆరోగ్యకరమైన ఆలోచనలోంచి వచ్చిందే ఇందులోని కథలన్నీ వివిధ పత్రికల్లో ప్రచురితమైనవే కూడా. రచయిత కలం నుంచి మరిన్ని మంచి కథలు ఆశించవచ్చు. ★★★

Ph. 9393981918
Email: subbarayudu7@yahoo.com
www.prathapa.yolasite.com

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.

Editor,
KOUMUDI (Web Monthly)
4251 - Escudo Ct
Dublin - CA 94568, USA